కూటమిలో ఆయకట్టు కుంపటి

- ఆధిపత్యం కోసం ఇరువర్గాల పోరు
- తలలు పట్టుకున్న ఇతర నాయకులు
- ఇన్‌చార్జికి తలనొప్పిగా మారిన ఎన్నికలు


మేజరు కాలువ

కురిచేడు: సాగునీటి సంఘాల ఆయకట్టు ఎన్నికలు కూటమిలో కుంపటి రాజేశాయి. టీడీపీలో ఆధిపత్యం కోసం ఇరువర్గాలు పోరుబాటపట్టాయి. ఇప్పటికే ఓటరు జాబితాలు సిద్ధం చేసుకుని తమకంటే తమకు ఓటు వేయాలని ఓటర్లను ప్రలోభ పెడుతున్నారు. జిల్లాలో 342 సాగునీటి సంఘాలకు ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైంది. అధికార టీడీపీ కూటమి అన్నింటినీ ఏకగ్రీవంగా కైవసం చేసుకునేందుకు పన్నాగాలు పన్నుతోంది. మండలంలో టీడీపీలో వర్గపోరు ఆ పార్టీ ఇన్‌చార్జికి తలనొప్పి తెచ్చిపెట్టింది. పంచాయతీ ఎన్నికలను తలపించేలా మండలంలోని ఆవులమంద సాగునీటి సంఘాల ఎన్నికలు మారాయి. మండలంలో 6 సాగునీటి సంఘాల పరిధిలో ఎన్నికలు జరగనున్నాయి. పడమరవీరాయపాలెం, కల్లూరు-1, పడమరనాయుడుపాలెం, ముప్ప గంగవరం, పడమర వీరాయపాలెం-2, బయ్యవరం సాగునీటి సంఘాలకు ఎన్నికలు అనివార్యం. అయితే వీటితో పాటు జిల్లా వ్యాప్తంగా ఉన్న 342 సంఘాలను తమ ఖాతాలో వేసుకునేందుకు అధికార కూటమి ప్రణాళికలు సిద్ధం చేసుకుంది. ఈ ఎన్నికలు మండలంలోని ఆవులమంద నీటి సంఘం ఆయకట్టు మాజీ అధ్యక్షుడు గొట్టిపాటి వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ కిలారి కొండయ్య వర్గాల మధ్య పోరుకు తెరలేపింది. ఒకే పార్టీకి చెందిన ఒకే గ్రామ నాయకులు తమ పంతం నెగ్గాలంటే తమ పంతం నెగ్గాలని భీష్మించుకు కూర్చున్నారు. ఇద్దరిని సఖ్య పెట్టేందుకు టీడీపీ ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మి చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. ఒకరికి నీటి సంఘం, మరొకరికి కురిచేడు సొసైటీ అధ్యక్షుడిగా ఇచ్చే విధంగా ప్రతిపాదనలు వారి ఇరువురి మధ్య ఉంచారు. సొసైటీ పదవికి ఇద్దరూ ఇష్టపడక పోవడంతో పాటు గ్రామంలో తమ హవా కొనసాగించుకోవాలనే ఉద్దేశంతో గ్రామస్థాయిలో పదవి కోసం ఇరువురూ పట్టుబట్టినట్లు సమాచారం. ఇదిలా ఉండగా సొసైటీ ప్రెసిడెంట్ పదవి మండల కేంద్రంలోని నాయకులకు మాత్రమే ఇవ్వాలనే ప్రతిపాదన లక్ష్మికి ఎదురైంది. ఉన్న తలనొప్పితో సతమతమవుతున్న లక్ష్మికి మరో తలనొప్పి వచ్చి పడింది. కొండ నాలుకకు మందువేస్తే ఉన్న నాలుక ఊడినట్లు ఆమె ప్రయత్నాలు విఫలమవుతున్నాయి.

ఇరువర్గాలను శాంతింపజేయాలనే ప్రయత్నానికి కొత్త సమస్యలు ఎదురవుతుండటంతో ఎటూ తేల్చుకోలేని అయోమయ స్థితిలో టీడీపీ నాయకులు ఉన్నారు. మండల నాయకులను సంప్రదించకుండా నిర్ణయం తీసుకోవడంతో ఇలా తలలు పట్టుకోవాల్సి వచ్చిందని కొందరు నాయకులు పేర్కొంటున్నారు. మండలంలోని నాయకుల అభిప్రాయం తీసుకోకుండా ఏకపక్షంగా హామీలు ఇవ్వడం ఏమిటని పలువురు సీనియర్ నాయకులు మండిపడుతున్నారు.

క్లుప్తంగా

ఘనంగా మల్లికార్జునస్వామి ఆలయ వార్షికోత్సవం


పూజలందుకుంటున్న మల్లికార్జున స్వామి

తాళ్లూరు: మండలంలోని సోమవరప్పాడులో ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ గుంటి గంగా భవాని అమ్మవారి ఆలయ ప్రథమ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. పూజారులు స్వామివారికి పంచామృతాలతో ప్రత్యేక అభిషేకాలు చేశారు. కార్తీక మాసం కోటి సోమవారం కావడంతో తెల్లవారు జాము నుంచే భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి దర్శనం చేసుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ నిర్వాహకులు అన్నదానం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

2025 ఓటర్ల జాబితా సిద్ధం


పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న లోకేశ్వరరావు

దర్శి: 2025 ఓటర్ల జాబితా సిద్ధం చేసినట్లు ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, డిప్యూటీ కలెక్టర్, ఫారెస్ట్ సెటిల్‌మెంట్ అధికారి ఎంవీఎస్ లోకేశ్వరరావు తెలిపారు. నియోజకవర్గంలోని దర్శి, తాళ్లూరు, ముండ్లమూరు మండల కేంద్రాల్లో పోలింగ్ కేంద్రాలను సంబంధిత తహసీల్దార్‌లతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా లోకేశ్వరరావు మాట్లాడుతూ నియోజకవర్గంలో ఇప్పటి వరకు 282 పోలింగ్ బూత్‌లు ఉండగా 2,26,169 మంది ఓటర్లు ఉండగా అందులో 1,14,100 మంది పురుషులు, 1,12, 041 మంది మహిళా ఓటర్లు, 8 మంది థర్డ్ జండర్ ఉన్నారన్నారు. ఎన్నికల కమిషన్ నిర్దేశించిన స్పెషల్ క్యాంపెయిన్ డేస్‌లకు సంబంధించి 9,10,24 తేదీల్లో అందరు బూత్ లెవల్ అధికారులు సంబంధిత పోలింగ్ కేంద్రాల వద్ద డ్రాఫ్ట్ ఓటరు జాబితా, ఖాళీ ఫారంలు-6,7,8లతో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు హాజరు కావాలన్నారు. ఓటరు జాబితాలో డబుల్ ఎంట్రీలు, మరణించిన ఓటర్లను ఫారం-7లో దరఖాస్తు చేయాలన్నారు. స్పెషల్ క్యాంపెయిన్ రోజు హాజరు కాని బీఎల్ఓలపై జిల్లా ఎన్నికల అధికారికి నివేదిక పంపి తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 18 సంవత్సరాలు నిండిన అర్హుల నుంచి ఫారం-6 స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్‌లు, అధికారులు పాల్గొన్నారు.

ఆక్రమణలు స్వచ్ఛందంగా తొలగించండి

గిద్దలూరు రూరల్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ నుంచి కుమ్మరాంకట్ట సెంటర్ వరకు జాతీయ రహదారికి ఇరువైపులా సైడు కాలువల పై ఉన్న ఆక్రమణలను స్వచ్ఛందంగా తొలగించాలని స్థానిక కమిషనర్ డీ.వెంకటదాసు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. లేకుంటే 13 వ తేదీ నగర పంచాయతీ వారు కాలువల పై ఉన్న ఆక్రమణలను తొలగింపు చర్యలు చేపడతారని హెచ్చరించారు.

అనాథ బాలికలను ప్రభుత్వం ఆదుకోవాలి


అనాథ చిన్నారితో రైతు సంఘ నాయకులు

పెద్దదోర్నాల: తల్లిదండ్రులు చనిపోయి దీనస్థితిలో ఉన్న అనాథ బాలికను ప్రభుత్వమే ఆదుకోవాలని కాంగ్రెస్ పార్టీ రైతు సంఘ జిల్లా అధ్యక్షుడు గాలి వెంకటరామిరెడ్డి ప్రభుత్వాని డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ పెద్దదోర్నాల మండలం కొత్తూరుకు చెందిన అన్నపురెడ్డి కృష్ణారెడ్డి అప్పులబాధతో చనిపోయాడన్నారు. ఈ క్రమంలో అతని భార్య సాయి లీలావతి మార్కాపురంలోని కంభం సెంటర్‌లో పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. లీలావతి తల్లి మధు అధికారులందరికీ అర్జీలు అందజేసి తన మనుమరాలిని ఆదుకోవాలని కోరింది. ఈ నేపథ్యంలో తహసీల్దార్, అగ్రికల్చర్ అధికారులు విచారణ చేశారు. అధికారులు నివేదికలను ఉన్నతాధికారులకు అందజేయలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రైతు ఆత్మహత్యగా నమోదు చేసుకొని అనాథలా మారిన చిన్నరిని ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి దుగ్గెంపూడి తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

తిరుమలనాథస్వామికి విశేష పూజలు


లింగాకారం ప్రతిమలతో పూజలు చేస్తున్న భక్తులు


తిరుమలనాథస్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు

పెద్దారవీడు: చట్లమిట్ల పంచాయతీ రాజంపల్లి సమీపంలో వెలసిన కలియుగ దైవం శ్రీ రాజ్యలక్ష్మి సమేత గొడ్రాలికొండ తిరుమలనాథస్వామికి కార్తిక మాసం సందర్భంగా భక్తులు విశేష పూజలు చేశారు. అర్చకులు భవానీ ప్రసాద్ ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లకు అర్చనలు, అభిషేకాలు, తదితర పూజలు చేసిన అనంతరం పట్టువస్త్రాలు, ఆభరణాలు ధరించి పూలమాలతో అలంకరించారు. ఆలయం ప్రాంగణంలో జ్యోతిర్లింగార్చన భక్తులను అకట్టుకుంది. మహిళలు శివలింగాకారంలో ప్రతిమల్లో కోటి ఒత్తులను ఏర్పాటు చేసి పూజలు చేసుకొని దీపారాధనలు వెలిగించారు. సంతానం లేని వారు ఆలయం వెనకాల ఉన్న గిరికొండ చుట్టూ భక్తిశ్రద్ధలతో ప్రదక్షిణలు చేశారు. మహిళలు నైవేద్యం తయారు చేసి స్వామి అమ్మవార్లకు పెట్టారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని కాయకర్పూరం సమర్పించి మొక్కులు చెల్లించి తీర్థప్రసాదాలు అందుకున్నారు.

కార్తీక కోటి సోమవారం సందర్భంగా ప్రత్యేక పూజలు


ఆలయంలో కుంకుమార్చనలు చేస్తున్న భక్తులు

త్రిపురాంతకం: శ్రీ బాలాత్రిపుర సుందరీదేవి, శ్రీ పార్వతి సమేత త్రిపురాంతకేశ్వరస్వామి ఆలయాల్లో కార్తీక మాసం శ్రవణ నక్షత్రం కోటి సోమవారం సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. త్రిపురాంతకం ఆలయాలు భక్తుల ప్రత్యేక పూజలతో నిండిపోయాయి. అమ్మవారి ఆలయంలో కుంకుమార్చనలు, స్వామి వారికి అభిషేకం నిర్వహించారు. ప్రత్యేకంగా అమ్మవారు స్వామి వారి అలంకారంతో దర్శనమిచ్చారు. ఇతర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు. ఆలయాల వద్ద సత్రంలో అన్నదానం చేశారు. కార్తీక మాసం కావడంతో అధిక సంఖ్యలో భక్తులు ఆలయాలకు వచ్చి పూజలు చేస్తున్నారు.

దర్శి: పట్టణంలోని శ్రీ కాశీఅన్నపూర్ణా దేవి అమ్మవారు సమేత కాశీ విశ్వనాథస్వామి వారి ఆలయంలో కోటి సోమవారం సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. మహా రుద్రాభిషేకం, అష్టోత్తర శతనామావళి పూజలు చేశారు. తెల్లవారు జామునే భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి కార్తీక దీపాలు వెలిగించారు. స్వామి, అమ్మవార్లను శ్రీ జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీ కాలహస్తీశ్వర స్వామిగా స్వామివారి అలంకరణ చేసి దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయాలి

పుల్లలచెరువు: మండలంలోని పలు గ్రామాల్లో ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని మండల సీపీఐ కార్యదర్శి గురునాథం కోరారు. ఆయన శనివారం మాట్లాడుతూ ప్రస్తుతం పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అపార్ ఐడీ కార్డులు తీస్తున్నందున విద్యార్థుల పుట్టిన తేదీలు, తల్లిదండ్రుల పేర్లు తప్పులు ఉన్న దృష్ట్యా సరి చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు ఆధార్ కేంద్రాల వద్ద నానా ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. విద్యార్థులకు అనుగుణంగా ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేసి వారి ఇబ్బందులు తొలగించాలని కోరారు.

స్పెషల్ క్యాంపెయిన్‌ను పరిశీలించిన తహసీల్దార్


ఓటరు జాబితాను పరిశీలిస్తున్న తహసీల్దార్

దొనకొండ: మండలంలోని పోలింగ్‌స్టేషన్‌లో జరుగుతున్న స్పెషల్ క్యాంపెయిన్‌ను తహసీల్దార్ బి.రమాదేవి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా 9, 10, 11, 12, 13, 15, 42, 43 పోలింగ్‌స్టేషన్లను ఆమె పరిశీలించారు. ఓటరు జాబితాను తనిఖీ చేసి ఫారం 6, ఫారం 7, ఫారం 8కు సంబంధించి, వందకు పైగా ఓటర్లను జీరో హౌస్ నంబర్లు, తప్పు, ఒప్పులు, బ్లూ ఫొటోల గురించి బీఎల్‌ఓలకు తగు సూచన, సలహాలు అందించారు. తహసీల్దార్ మాట్లాడుతూ బీఎల్‌ఓలు స్పెషల్ క్యాంపెయిన్‌ను జాగ్రత్తగా చేయాలని, ఏవైనా సమస్య ఉంటే తమకు తెలియజేయాలన్నారు. గ్రామంలోని ఓటర్లతో జాగ్రత్తగా మాట్లాడాలని, వారు చెప్పిన విషయాలు, సమస్యలు తెలుసుకుని లిఖిత పూర్వకంగా తమకు అందజేయాలని బీఎల్‌ఓలకు తహసీల్దార్ సూచించారు. ఆమె వెంట రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

తాగునీటి పైపులైన్‌కు మరమ్మతులు


పైపులైను లీకుకు చేసిన మరమ్మతులు

కురిచేడు: ఎయిర్‌టెల్ కేబుల్ తాగునీటి పైపులను డ్యామేజ్ చేయడంతో నీరు వృథా అవుతోంది. మండలంలోని దేకనకొండ వద్ద ఈ సంఘటన శనివారం జరిగింది. కేబుల్‌ను భూమిలో టవర్‌కు అనుసంధానం చేసే క్రమంలో వేసిన కేబుల్ పైపులైను మధ్య నుంచి వెళ్లింది. దీంతో నీరు లీకై వృథాగా పోతుండటంతో సర్పంచ్ సోమవరపు కళావతి స్పందించి వెంటనే పైపులైనుకు మరమ్మతులు చేయించారు. కేబుల్ నిర్మాణ సమయంలో భూమిలో ఉండే తాగునీటి పైపులైనులు చూసుకోకుండా, గ్రామ సర్పంచ్‌లను సంప్రదించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఎయిర్‌టెల్ కంపెనీ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని సర్పంచ్ కళావతి కోరుతున్నారు. పైపు లైనుకు జరిగిన నష్టాన్ని ఎయిర్‌టెల్ కంపెనీ చెల్లించేలా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని ఆమె కోరుతున్నారు.

బెల్టుషాపు నిర్వాహకుడి అరెస్టు


బెల్టుషాపు నిర్వాహకుడితో ఎక్సైజ్ పోలీసులు

కురిచేడు: మండలంలోని పడమర గంగవరంలో బెల్టుషాపు నిర్వహిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి అతని వద్ద 10 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు దర్శి ఎక్సైజ్ సీఐ శ్రీనివాసరావు తెలిపారు. సీఐ కథనం ప్రకారం.. ఎస్ఐ వీఆర్ సత్యనారాయణ తన సిబ్బంది ఎస్.శ్రీనివాసరావు, పి.నాగరాజులతో కలిసి గ్రామంలోని పరిమిశెట్టి శ్రీను వద్ద మాల్టెడ్ ఫైన్ విస్కీ క్వార్టరు పది బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. మరో వ్యక్తి వద్ద మద్యం లభించలేదని తెలిపారు. మండలంలో బెల్టుషాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని, కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని సీఐ హెచ్చరించారు.

చిన్నారులకు పంటలపై అవగాహన


చిన్నారులకు అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీలు

పుల్లలచెరువు: మండలంలోని నాయుడుపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో చదువుతున్న చిన్నారులకు శనివారం పంట, పొలాలపై అవగాహన కార్యక్రమాన్ని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుబ్బమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రకృతి సందర్శన కార్యక్రమంలో భాగంగా చిన్నారులను సమీపంలోని పంట పొలాల్లోకి తీసుకెళ్లి పొలాల్లో మొక్కలు ఎలా మొలుస్తాయి, గింజలు ఎలా తయారు చేస్తారు, కాయలు ఎలా పండుతాయి మిగిలిన అంశాలపై అవగాహన కల్పించినట్లు సుబ్బమ్మ చెప్పారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారులకు పంట, పొలాలపై ఆసక్తి పెంపొందించేందుకు జిల్లా అధికారుల ఆదేశాలపై ఈ కార్యక్రమం నిర్వహించినట్లు ఆమె పేర్కొన్నారు. అంగన్‌వాడీ టీచర్లు ప్రసన్న, జయమ్మ, కాశమ్మ, ఆయాలు వెంకటలక్ష్మి, నాగలక్ష్మి, నాగమ్మ, చిన్నారులు పాల్గొన్నారు.

సీపీఎం మహాసభలు జయప్రదం చేయండి


కరపత్రాలు విడుదల చేస్తున్న సీపీఎం నాయకులు

దర్శి: సీపీఎం దర్శి ప్రాంత 7వ మహాసభలను ఈ నెల 19న జయప్రదం చేయాలని నియోజకవర్గ కార్యదర్శి తాండవ రంగారావు పిలుపునిచ్చారు. స్థానిక సుందరయ్య భవన్‌లో ప్రచార మెటీరియల్ కరపత్రాలు, పోస్టర్‌లు, జెండాలను సీనియర్ నాయకులు సందు వెంకటేశ్వరరావు శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ మహాసభల్లో కేంద్రం, రాష్ట్రంలో వచ్చిన కొత్త ప్రభుత్వాలు వాటి విధానాలు, అవి ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయడం, ప్రజల పరిస్థితులు, నిత్యావసర ధరల పెరుగుదల, దర్శి నియోజకవర్గ అభివృద్ధి, వ్యవసాయ, ఆర్థిక పరిస్థితులు అంశాలను చర్చించి నాయకులు, కార్యకర్తలకు దిశ నిర్దేశం చేస్తారని వివరించారు. గత పోరాటాలను సమీక్షించుకుని రాబోవు కాలంలో జరిపే పోరాటాలకు ప్రజలను సమీకరణ చేయడం, కార్యకర్తలను ఉద్యమంలో మరింత భాగస్వామ్యం చేయడం, ప్రజా సంఘాల సభ్యత్వం పెరుగుదల తదితర అంశాలపై తీర్మానాలు చేస్తారని చెప్పారు. రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొనే కార్యక్రమానికి పెద్ద ఎత్తున ప్రచార ఏర్పాట్లు చేయనున్నట్లు వెల్లడించారు. సీపీఎం నాయకులు ఉప్ప నారాయణ, కేవీ పిచ్చయ్య, చిట్ల ఆదినారాయణ పాల్గొన్నారు.

సర్పంచ్ చొరవతో కుక్కల పట్టివేత

సాక్షి ఎఫెక్ట్..


దేకనకొండలో కుక్కలను పట్టుకుంటున్న సిబ్బంది

కురిచేడు: మండలంలోని దేకనకొండలో వీధి కుక్కల స్వైర విహారం అన్న శీర్షికతో శనివారం సాక్షి దినపత్రికలో ప్రచురించిన కథనానికి సర్పంచి స్పందించారు. గ్రామ సర్పంచ్ సోమవరపు కళావతి, ఆమె తనయుడు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఏసుబాబు కుక్కలను పట్టేవారిని పిలిపించి వాటిని పట్టించారు. కుక్కలను దూరంగా వదిలేసి వచ్చారు. దీంతో గ్రామంలో కుక్కల నుంచి ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

లక్ష్మీచెన్నకేశవస్వామికి శాంతి పూజలు

మార్కాపురం టౌన్: పట్టణంలో వెలసిన శ్రీ దేవీ భూదేవీ సమేత శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో చెన్నకేశవస్వామి వారికి ప్రత్యేక శాంతి పూజలు అర్చకులు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి అభిషేకాలు, అర్చన, ప్రత్యేక పూజలను శాస్త్రోక్తంగా అర్చకులు శ్రీపతి అప్పనాచార్యులు, రంగమాచార్యులు నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో వెంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు అర్చకుడు అరుణ్‌స్వామి నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారిని భక్తులు దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

బైకును ఢీకొన్న కారు

- ఇద్దరికి గాయాలు


సత్యనారాయణను ఆస్పత్రికి తరలిస్తున్న 108 సిబ్బంది

కురిచేడు: మండలంలోని పెనగమూరు వద్ద బైక్‌ను కారు వెనుక నుంచి ఢీకొట్టడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన శనివారం సాయంత్రం జరిగింది. వివరాలు.. బోధనంపాడు గ్రామానికి చెందిన వేమా పవన్, బ్రహ్మయ్య, పుల్లలచెరువు సత్యనారాయణలు కురిచేడు వెళ్లాలని అనుకున్నారు. కారులో పవన్, బ్రహ్మయ్యలు, బైక్‌పై సత్యనారాయణ బయల్దేరాడు. బోధనంపాడు నుంచి కురిచేడు వస్తూ పెనగమూరు వద్దకు వచ్చే సరికి ముందు వెళ్తున్న బైక్‌ను వెనుక నుంచి గట్టిగా కారు ఢీకొంది. రోడ్డు పక్కనున్న చెట్లలో కారు, బైకు పడిపోయాయి. ఇక్కడ ఏం జరిగిందో తెలియదుగానీ సంఘటన స్థలంలో బైక్‌పై పవన్, కారులో సత్యనారాయణ ఉండటం గమనార్హం. ప్రమాదంలో పవన్, సత్యనారాయణకు బలమైన గాయాలయ్యాయి. 108 సిబ్బందికి సమాచారం అందించటంతో సిబ్బంది రహమాన్, మహబూబ్ బాషాలు క్షతగాత్రులకు ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం దర్శి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వేమా పవన్‌ను ప్రైవేటు వాహనంలో వినుకొండలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. ఈ ఘటనపై బోధనంపాడు గ్రామంలో పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. పూర్తి సమాచారం పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది.

వైభవంగా శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు

పొదిలి: స్థానిక దర్శి రోడ్డు శ్రావణి ఎస్టేట్‌లోని శ్రీలక్ష్మీ పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరిగాయి. శనివారం హోమాలు, ప్రత్యేక పూజలు, శ్రీపుష్ప యాగం, ద్వాదశ ఆరాధన, చక్రస్నానం, అన్న సమారాధన జరిగింది. ఉభయదాతలు మాగులూరి సుధాకరరావు, అనూరాధ దంపతులను మేళ తాళాలతో ఆహ్వానించి వారిచే ప్రత్యేక పూజలు చేయించారు. పుష్పాభిషేకం, చక్రస్నానం కార్యక్రమాలను భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తిలకించారు. ఉభయదాతలను ఆలయ కమిటీ సభ్యులు పట్టు వస్త్రాలతో సత్కరించారు. నారాయణం మురళీ కృష్ణమాచార్యులు, దీవి శ్రీకాంత్ భట్టర్, వై.రుషీకేశవాచార్యులు ఆధ్వర్యంలో పూజాధికాలు నిర్వహించారు. గౌరవాధ్యక్షుడు శ్రావణి వెంకటేశ్వర్లు, అధ్యక్షుడు యక్కలి శేషగిరిరావు, కోశాధికారి శనగపల్లి నాగేశ్వరరావు, మేడా నరసింహారావు ఉత్సవాలను పర్యవేక్షించారు.